# పంచసాయకం

●

ఆ మాట వినేటప్పటికి - నాకు ఎక్కడ లేని నవ్వొచ్చింది.

తాను, మీగడతరక లంటుకున్న మీసాలు దువ్వుకుంటూ చేసిన వ్యాఖ్యానానికి, నేను కూడా హర్షించుతూన్నానని ఆ ఆసామీ యింకా సకిలిస్తూనే ఉన్నాడు.

పొగలు వెళ్ళే కాఫీ, హాలంతా మారుమోగేటట్టుగా జుర్రుతూ, అనవసరంగా, అయ్యరును 'ఏడయ్యా! ఆయన కనపడడేం ?' అని అడిగాడు. అరవసోదరునికి అది అర్థం కాక, ఆ సందడిలో, నోరు తెరిపిలేక 'ఎవరు' అని గాలిలో తలత్రిప్పుతో ప్రశ్న చుట్టాడు. 'ఆయ నయ్యా - పంతులు' అని వివరించాడు ఆ కాఫీ- పాయి. విని, కొంచెం వికటంగా పెదవివిరిచాడు అయ్యరు. ఆ చేదు మ్రింగి, ఆసామీ... హాలులో అప్పుడున్న వారందరికీ ఆ హాలహాలంలో పాలు పంచడం చూస్తూ—

అప్పుడు - నేను ఫక్కున నవ్వింది.

అందులో ఉన్న వెన్నెల ఆ అంధుల కళ్ళపడదు- అందుకని కాదు - నేను నవ్వడం: ఆతని మాటలు తలచుకుని—

ఆతడు - ఎవరో అందరికీ తెలియవలసిన అగత్యం ఏముంది ? 'పంతులూ' అని పిలిస్తే 'ఆఁ' అని మారుపలికి అడగటం తడవుగా అమృతతుల్యమైన కాఫీ తయారుచేసి యిస్తూన్నప్పుడు.

అసహ్యంగా ఉంటాడూ - తలమాసి గడ్డం పెరిగి?- అయితే మాత్రం ఏం ?

అతి కటువుగా మాటాడుతాడూ ?-అందుకనే నాకు అతనితో అంత స్నేహం అయింది.

అవాళ పంతులు కనబడలేదు- అడిగితే, అయిదు నిమిషాలు నసిగి కాని, అయ్యరు అసలు సంగతి చెప్పలేదు.

—ఆ వార్డులో...అటువైపునుంచి డాక్టరు అప్పుడే వస్తున్నాడు. అక్కడే ఎదురుపడి—ఎవరో సిస్టరు నన్ను అతడున్న చోటికి తీసుకువెళ్ళింది.

'ఏం తమ్ముడూ ?'—నేను - ఆత డంత చనువుతీసుకున్నా ఏమీ అనుకోలేదు.

'పంతులూ - ఇవాళ కాఫీ ఏమీ బాగుండలేదు'

'అవును బాబూ - అందరూ, పంచదార ఎక్కువ కలుపుతారు, చేదు చస్తుంది.' ఆ మాటలూ అర్థంకాలేదు అప్పుడు. ఆతడు ఎందుకలా కళ్ళతో నవ్వుతున్నాడో అసలు తెలియలేదు.

'అదికాదు భాయీ—తమాషాచూడు — వెనుక, చాలా సంవత్సరాలక్రితం, పంతులుకు ఇలాగే, పవళింపు సేవ జరిగినప్పుడు—బ్రహ్మాండ వైభవం ! ఎలా ఉన్నానో కనుక్కుని పోదామని, గడియ కొకసారైనా అధమం, గాజుల

జత నా ముందు గలగలలాడేది.... మళ్ళా ఇన్నాళ్ళకు తల వని తలంపుగా మనకు ఈ స్థితి సమకూరడం...చూడటానికి మగవాడా రావడం...అందుకు నవ్వు వచ్చింది—'

—కొంచెం ఆయాసపడ్డాడు. లోపల నెత్తురు కమ్మి నుదుటిమీద మచ్చలు ఎర్రవాగు తేలినవి. కళ్ళుమూసు కుని రవంతసేపు ఊరుకుని, మళ్ళా అందుకున్నాడు.

'ఎవరూలేరు. కావలసినదికూడా ఏమీలేదు - నేను ఏమైతేమాత్రం ఏం...'

తలవేపున వున్న చార్టువంక చూచాను, మళ్ళా ఉష్ణం పెరిగేవేళ అయిందేమోనని...

'అదంతా ఆస్పత్రివాళ్ళ హంగామాకాని...ఆ గీతల ప్రకారం ఎక్కి దిగుతుం దంటావా ?—మన గీత వాళ్ళకు ఏం తెలుసూ, అనుభవించిన నాకే అర్థంకానప్పుడు—'

'మెదలకుండా పడుకో, విశ్రాంతిగా. మళ్ళా రేపు వస్తాను.'

'మళ్ళా నీవు రావలసిన అవసరం ఉండదులే. నన్ను మాట్లాడనియ్యి. మాటలన్నీ విని - మనసులో ఏమన్నా అనుకో— 'నలుగురు కూర్చుని నవ్వేటప్పుడు నా పేరొక పరి తలవండీ'- ఏం ఉలికిపడుతున్నావు ? - కాఫీ అందిచ్చే అంత క్రిందమెట్టుమీద ఉన్నజీవికి ... కావ్యాలాపాలేమి టనా...ఏమో ఊహించుకో.

'ఏమిటనా-పోనీతే...చెపుతాను విను :'

"ఎనిమిదిఏళ్ళు నిండీనిండని పిల్లను...చిన్నప్పుడు నాకు పెళ్ళిచేశారు. ఆరోజు మొదలనుకో. అంత పసివయసు

నుంచే, అమితమైన గౌరవం, అనురాగం కలిగింది, ఆడవాళ్ళ మీాద నాకు.

అప్పచెల్లెళ్ళు ఎవరూ లేరు—మనది వెనుకామున్దూ అతి నిప్పచ్చపుట్టుకలే! అమ్మ నేను భూమిమీాదపడినప్పటి నుంచీ లేదు. అలా, తోడూ నీడా లేకపోవడం- ఆ లోపం, ఆ అమ్మాయివచ్చి తీర్చడానికి పూనుకొన్నతరువాత కాని తెలిసిరాలేదు.

అచ్చమైన చీకటిలో ముద్దకట్టుకు బిగిసిపోయివుండి, అదే ఆనందావధి అనుకున్న అమాయకుడికి ఆ పసివయసుది వెన్నెలకు విలువకట్టడం ఎలాగో నేర్పిందంటే అంతకుమించే నేర్పరితనం అతి అరుదుకాదా భాయ్ !

పదిహేడుఏళ్ళు దాటకుండానే...నా వెన్నెలంతా పండబారిపోయింది. కలసిమెలసి ఈడుజోడుగా పెరిగాం. కాపురమునకువచ్చే వయసుకు కరవైపోయింది. కన్నతండ్రి ...గుండె నిలుపుకోలేక నన్ను వంటరిగా భూమిమీాద వదలేశాడు.

అందుకు నా కేమాత్రమూ - అంతగా విచారం వేయలేదు - ఎందుచేతనో - కాని, తెగిన గాలిపడగ అలా గాలిలో తేలుతూపోయి, ఎక్కడ వాలుతుందో- ఏ ముళ్ళ పొదమీాదనో - అవును, ఎందుకో తెలియకపోయినా, ఏ వైపునో ఎగురుతూండవలసిందేగా-

మరీ, కవిత్వం అవుతూందికాదూ, ఓ మెట్టు దిగుతాను. అలా, వంటరిగా ఎవరూ లేకుండా మిగిలానా, ఎంత

కాలమో, ఏజోలికీ పోకుండానే గడిపాను, నెలలపాటు ఒక్కొక్కతడవ, కాలు గడపదాటనీయకుండా. అవును. అది గొప్పయింట పుట్టబట్టికాదూ—ఆ అలవాటు-

...అదీ—క్రమంగా అలవాటైంది. మొదటిసారి, కాలు జారడం మాత్రమే జ్ఞాపకం ఉన్నదికాని, ఆ విషయంలో అప్పుడు - ప్రజ్ఞకాదు ... పరాక్రమం కాదు, జయించుకువచ్చింది.

జయించింది ఎవరు - నేను కాదు...ఆలా తీయని మాటలు, ఆ అమ్మాయిలాగానే చూపులు...అందుకోసమని...అందని మానిపండులాగా నటించిన ఆ మేడిపండును అందుకునేందుకు చేయి జాపి...మోసపోయింది...

ఆ తరువాతకూడా ... ఆశపడలేదు. విశేషం...అసహ్యమూ అనిపించలేదు. అది...ఏంకావాలో తెలియని లోపం...ఇప్పటికీ తెలియడంలేదులే నిజానికి !

—అప్పుడు గట్టిదెబ్బే తగిలింది, కాని ఆటలో అరటిపండులాగా తోచింది, నా ప్రాణానికి...అదీ అర్థంకాకనే !

—కాశ్మీరంనుంచి, కన్యకుమారిదాకా...ఆ ఆశే ఆ పాటే...చాలా అన్యాయంకాదూ?—నేనుఅంటూన్నది సరిగా అర్థమౌతూన్నదా లేదా?—ఇంకా విప్పిచెపుతాను.

నేను ఎంతమాత్రమూ అమాయకుణ్ణికాను - అప్పటికే కాదు,ఇప్పుడు...ఇంత ఆరముగ్గిన తరువాత-

నాకు అర్థంకాకపోవడం నాలోపమే అనుకోవాలా ? -చిన్నతనంలో నా సావాసగత్తెగా ఉండి ... అంతకు

మిక్కిలి నాకు కోరిక ఏమీ అలవాటుచేయకుండానే అలా మాయమైపోయిన ఆ అమ్మాయి...అనురాగాన్ని మించి నేను-ఎదుగలేదు...ఆడతనం - అంతవరకే నాకు మనసుకు నచ్చేటట్టు అక్కరకువచ్చింది-అంతకు మించకుండా-నేను : మించితే-లోక మేను :

ఇంతకు పూర్వమే చెప్పానుకాదూ- 'సేతుశీతనగ మధ్యోర్వి' యావత్తూ - మన ప్రణయ - జయకాండ, నడచిందని; అతి సైంటెఫిక్ గా ఆమూలాగ్రం పరిశీలించాను బాబా! ఇంపీరియల్ గెజటీర్...కన్నింగ్ హామ్ పరిశోధనలు జోడించుకుని...అసలు సిసలైన అంగవంగాది యాభైయారు రాజ్యాలూ గాలించి చూశాననుకో - ఒక్క పాటలీపుత్రం మినహా - ముఖ్య రాజధానులన్నిటా ఎక్కని గడప లేదు...పదహారు సంవత్సరాలు ఏకధారగా అయిదులక్షల రూపాయలు...ఆ ఆనందాన్ని పసికట్టడం కోసం హాయిగా ఆహుతిచేశాను ... అతిశయోక్తి అనేది ... అసలు యీ ప్రబంధంలో ఎక్కడా తగలదని నమ్మాలి—

ఎన్నైనా చెప్పు...ఎన్ని ఆటలన్నా ఆడు... ఎంతంత చెలగాటానికైనా ...ఏ దేశంలోనైనా ఆ జాతి...సై... కాని అంతతో ఆగిపోతుందా...ఆఖరుకు - అది : అందు కోసమే యీరహదారులన్నీ అని అచ్చుపోసేటప్పుడే బ్రహ్మ ...అలా పుదించాడంటావా నేను నమ్మను...అందుకోసమేనా...కాకపోతే ఆడజాతంటూ అవసరంలేదా ?—

అవసరం తీర్చుకుని - బయటపడి అంతతో మరచి

పోనడంలోనే...అనుభవానికి పరమావధి ఇమిడిఉన్నట్లయితే చీకటిలో ... తలుపులు మూసుకుని తప్పిదంచేయడానికే నిర్మించిన ఈ జంతుజాలం వెన్నెల అంటే అంత పడి చావడం యెందుకు!

వెన్నెలకోసమేనోయ్ నేను వెదకింది. చీకటిలో బ్రతుకంతా చిందులుత్రొక్కింది!

ఏమో నాకు...ఎంత అనుభవమైనా, ఏమాత్రమూ అర్థంకాదు. ఏంకోరాను? హాయిగాఆటలుపాటలై అందాలు నిలిచే అమాయిక అసంసర్గ ప్రణయం...ఏం దొరికింది, నిలువెల్లా...విషం...దహించుకుపోతాను. కాని తరించలేక పోయినాను...పోనీలే సాధనకు అంతేమిటి?"

*　　*　　*　　*

అంతసేపూ...ఎంతసేపైందో...నాకు తెలియలేదు. డాక్టరు వచ్చి...నే నింకా అక్కడే ఉండటం వింతగాచూసి ...ఆయాసం ఉబుకుతూన్న ఆతనివంకచూసి ... గంభీర మర్యాదతో నాకు సెలవుయిచ్చాడు...మరునాడు అక్కడికి వెళుదామనుకుంటూండగా, ఏదో అవాంతరంవచ్చింది ...అలా రెండు మూడురోజులు గడచినవి...ఇక ఆమీద వెళ్ళినా...ఎవరికోసం—

ఆతడు చెప్పినదాంట్లో అబద్ధము ఏమన్నా ఉన్నదా, అంతా నిజమేనా?

అయితే నిజానికి నిజస్వరూపం ఇంత భీభత్సంగా

ఉంటుందా? నాకు అర్థంకాలేదంటే ఆశ్చర్యమేముంది? అతనికి...ఆతడు ఎంతవరకూ అంతుచిక్కాడు?

అర్థణాకాఫీ...అరగంటసేపు...అదీ యిదీ కావాలని కొసరి రెట్టించుకుని...అంతలో కడుపునింపుకునే ఆ వాజలకు ...పంతులు అంత తేలికగా అర్థమయేవాడా?...

అందుకోసం...అన్నాళ్ళకు...ఆతని ప్రశంసవచ్చి... ఆ జవాబులు చూసి...నే నలా ఫక్కున నవ్వింది!

—[○]—